

# పున్నాగ పూలు సన్నాయి

స్వరూప్ సిన్హా

లాభం లేదమ్మాయిగోరూ.. ఊళ్ళోకి తీసుకెళ్ళి రిపేరు చేయించుకు రావలసిందే"

గంటసేపు జడివానలో ఎంబాసిడర్ కారుతో ఎడతెగని పోరాటం తరువాత నిస్పృహగా చెప్పాడు డ్రయివరు.

వెనక సీట్లో రిలాక్స్‌డ్‌గా కూర్చుని "లుక్ ఇంటూ హిజ్ ఏంజెల్ ఐస్... వన్ లుక్ యూఆర్ హిప్నోటైజ్డ్" మృదుమధురమైన 'అబ్బా' క్యాసెట్‌ను వింటూన్న విజేత ఒక్కసారిగా వులిక్కిపడింది.

నాన్నగారోవైపు చెపుతూనే ఉన్నారు. 'వెళుతున్నది దట్టమైన అడవిమార్గం జాగ్రత్త' అని. 'ఈ వానలో, ఈ చీకటిలో ఎలారా దేవుడా!' అనుకుంటూండగా, దేవుడు పంపిన దూతలాంటి వృద్ధుడొకతను గొడుగు, కంబళి, హరికేన్ లాంతరుతో దూరాన్నుంచి రావడం గమనించింది విజేత. అతను దగ్గరకొచ్చి చెప్పాడు "గంట నుంచీ సూత్తన్నా బాబయ్యా ఇంకా ఎంతసేపవుతదో ఏటో.. ఇక్కడికి దగ్గరే మా అయ్యగారి బంగళా ఉంది. అమ్మాయిగోర్ని అక్కడికొచ్చేసి కూకోమనండి. అంతలో మెకానిక్‌ను తెచ్చుకుని తమరు కారు బాగుచేయించుకోవచ్చు."

ఆ వృద్ధుడి కరుణగల కళ్ళు చూస్తే నిజంగానే దేవదూత అనిపించాడు. మరేం ఆలోచించకుండా చటుక్కున డోర్ తెరుచుకుని కారు దిగింది. గొడుగు విజేతకిచ్చేసి కంబళి వాళ్ళిద్దరూ కప్పుకున్నారు.

కొంతసేపటికి బంగళా దగ్గరకు చేరుకున్నారు వారు. దేదీప్యమానంగా వెలుగుతున్న ఆ పెద్దభవనం. అంతసేపూ తానున్న అడవిలోని కటిక చీకటికి భిన్నంగా ఉండటంతో ఓ వైపు జడివాన కురుస్తూనే వున్నా ప్రాణం లేచి వచ్చినట్టయ్యింది విజేతకు. ఆ తోటలోని రాధామనోహరాలు, మాలతీమాధకాలు, సంపెంగలూ, సన్నజాజులూ



ఆహ్లాదకరమైన సువాసనల్ని వెదజల్లుతున్నాయి. గేటుదగ్గర నేమ్ ప్లేటు చూసి ఆగిపోయింది విజేత.

'మనోహర్ కృష్ణ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్.'

ఎదురుగా నిలువెత్తు ఫోటోలో తన మనోహరుడు. అతని పక్కనే ఓ పాతికే కళ్ళ అమ్మాయి. ప్రపంచంలోని సంతోషాన్నీ, విజయోత్సాహాన్నీ కళ్ళల్లో నింపు కొని, గులాబీ రేకుల్లో కలగలిపిన విరిసే విరజాజి మొగ్గలాంటి చిరునవ్వుతో చప్పట్లు చరుస్తూ నిలుచుని ఉంది. ఏదో మొక్కుబడిగా ఆమె నవ్వడం లేదు. కళ్ళు సంతోషంతో పొంగి పొర్లి నవ్వుల్ని వెదజల్లుతున్నాయి. జీవాన్ని ఒలికిస్తున్నాయి. యూనివర్సిటీలోనూ, నేషనల్ లెవెల్ సెమినార్స్‌లోనూ అతనికి చాలాసార్లు బహుమానాలు రావడం తనకు తెలుసుకాబట్టి కృష్ణకు ప్రెసిడెంట్స్ మెడల్ రావడం విజేతకు వింతగా అనిపించలేదు.

కానీ అతని పక్కన ఆమె ఎవరు?

"నిండా తడిసిపోయినారమ్మాయిగోరూ! ముందు తల తుడుసుకొని ఈ టీ తాగండి రొంప చేస్తాది" పని మనిషి మాటల్తో ఈ

(మిగతా 34వ పేజీలో చూడండి)

లోకంలోకి వచ్చింది. టీ తాగి తల తుడుచుకున్న తర్వాత కొంత సేదదేరినట్టనిపించింది.

'ఆ ఫొటో లోని ఆమె అతని భార్యా?' నిస్రాణగా బెడ్‌మీద వాలి కళ్ళు మూసుకుంది.

మొత్తానికి కృష్ణ తన లక్ష్యాన్ని సాధించాడు. ఒక్కసారిగా గతం ఆమె కనురెప్పల వింజామరల చాటున కదిలింది.

"నాకు నా కూతురు సుఖసంతోషాలు ముఖ్యం. అందుకే కులమతాల, అస్తి అంతస్తుల ప్రసక్తి పక్కన పెట్టి మా విజీ సంతోషం కోసం నిన్ను పిలిపించాను. పెళ్లయ్యాక నువ్వు యిల్లరికం ఉండాలి. నీ పూర్ తల్లిదండ్రులను పట్టుకు వేళ్ళాడతానంటే కుదరదు. నువ్వెంత గోల్డ్ మెడలిస్ట్‌వయినా నిరుద్యోగివే. నా ఇన్‌ఫ్లూయెన్స్ ఉపయోగించి ఎక్కడో అక్కడ నీకు ఉద్యోగం వేయించే వరకూ మా ఫ్యాక్టరీ లోనే జి.యం. హోదా వెలగబెట్టాలి. లేకుంటే పదిమందిలో నాకు తలవంపులు.." విలాసంగా సిగార్ పీలుస్తూ ఆయన ధోరణిలో ఆయన చెప్పుకుపోతుంటే, ఆ అహంభావానికి నాగేశ్వరావుగారి మీద ద్వేషం కలిగింది కృష్ణకు.

"అంతేనా ఎమ్మెల్యేగారూ ఇంకా ఏమైనా ఉన్నాయా? నా తల్లిదండ్రుల్నీ, తోడబుట్టిన వాళ్ళనూ చంపెయ్యొద్దూ? నా పీ.జీ. డిగ్రీనీ, గోల్డ్ మెడల్‌నూ తగలెయ్యొద్దూ.. మీ అమ్మాయిని చేసుకోవాల్సిన వాజమ్మకు అవేం ఉండనక్కర లేదనుకుంటా!" వ్యంగ్యంగా అన్నాడు.

"షటప్... హద్దు మీరుతున్నావు. నీకెంత కట్నం కావాలో త్వరగా తేల్చుకో... అవతల

## పున్నాగ పూల సన్నాయి

*(31వ పేజీ తరువాయి)*

నాకు బోల్డు పనులున్నాయి."

"మిస్టర్ ఎమ్మెల్యే. నా విజేతను నాకిచ్చెయ్యడానికి ఎంత డబ్బు కావాలో మీరే చెప్పండి. మీ ముఖాన కొడతాను. మీ అమ్మాయిని వ్యక్తిత్వమూ, ఆత్మగౌరవమూ, తెలివితేటలు లేని ఏ పరాన్న భుక్కుకో కట్టబెట్టాలనుకుంటే నిరభ్యంతరంగా కట్టబెట్టండి. అప్పుడు మీ కండిషన్లన్నీ నెరవేరతాయి."

"ప్రపంచాన్ని సృష్టించిన దేవుడే లేడనేవారి పామరత్వాన్ని నేను క్షమించగలనేమోగానీ సర్వోత్కృష్టమైన ఈ మానవ జన్మను నాకిచ్చిన నా తల్లిదండ్రులను వదులుకోమంటే ఎవరినైనా సరే నేను నడిబజార్లో నిలబెట్టి షూట్ చేస్తాను. విజీ నాకో రెండేళ్ళు టైమివ్వు. సివిల్ సర్వెంట్ నవుతాను"

"నీకు చాలా ఓవర్ కాన్ఫిడెన్స్ ఉంది. ఇంతకూ ఇల్లరికం ఉండనంటావు" కోపంగా అడిగింది విజేత.

"నీ మైండంతా మెటీరియలిజంతో నిండిపోయింది విజీ. ఇట్ బ్యాడ్‌లీ నీడ్స్ రిపెయిర్" అంతే కోపంగా అన్నాడు కృష్ణ.

అలా కూలిపోయింది వారిద్దరి మధ్యా గల సాన్నిహిత్యపు వంతెన. నిట్టూర్చి వర్తమానంలోనికొచ్చింది విజేత. దిండు కింద ఏదో డైరీలాంటిది దొరికితే, తీసి అప్రయత్నంగానే పేజీలు తిరగేసింది. చదువుతుంటే ఆమె ముఖంలో రంగులు మారాయి.

'సుమతీ..

ఎడారిలో చల్లటి చిరుజల్లులా
పునర్జీవనాన్ని ప్రసాదించిన నీకు
ప్రతిగా నేనేమివ్వను నేస్తం?

నా రుధిరంతో ముఖమల్ తివాచీని నేసి కన్నీటి చుక్కల అద్దకాన్ని అద్ది నీ కాలి బాటలో పరిచి నీకు నా ప్రాణంతో స్వాగతం చెప్పనా నేస్తం!' త్వరత్వరగా పేజీలు తిరగేసింది. ప్రతి పేజీలోనూ సుమతి... సుమతి... ఎవరీ సుమతి?

అంతలో తలుపు చప్పుడయ్యింది. ఆ ఫోటోలోని అమ్మాయే. ఇతని ఇంట్లోనే ఉంటోందన్నమాట! అదే చిరునవ్వుతో పలకరించింది.

"కృష్ణ ఆ డైరీ అంతా నాతోనే నింపేశాడు కదూ. బైది వే, నేనే ఆ సుమతిని.. మీరు విజేత, అవునా?"

"మీకు.. మీకు.. నేనెలా తెలుసు?" విజేత మదిలో కోటి ప్రశ్నలు.

"ఒకప్పుడు మీకూ కృష్ణకూ వివాహం జరగాల్సింది, అని కూడా తెలుసు" అందా అమ్మాయి.

"ఓహో.. తన కృష్ణను సొంతం చేసుకున్నందుకు ఈమెకు తగని గర్వం కాబోలు" అనుకుంటూ విజేత అడిగింది.

"మీరు.. మీరు.. మనోహర్ కృష్ణగారి కేమవుతారు?"

"ఏమవుతాను విజీ? అతని మనసులోని ఊహను, అతని ప్రాణాన్ని, అతని ధ్యానాన్ని, నిరంతరం అతని కన్నుల్లో కదలాడే రూపాన్ని."

"ఇక చాలు సుమతీ. నీ గురించి అంతా చదివాను. మీ నీచమైన సంబంధాన్ని అందమైన రంగుటద్దాల్లోంచి గొప్పగా చూపించి తప్పించుకోవాలనుకోకు"


"నీకు తెలుసా విజీ! ప్రేమ అనేది స్త్రీ పురుషుల మధ్యనుండే ఆకర్షణ కాదని, అది అందానికి, డబ్బు, హోదాలకు లొంగదని. పెళ్ళీ పిల్లలతో అంతమయ్యే శారీరక సంబంధం కాదని.."

"ఇలాంటివి పుస్తకాల్లో, సినిమాల్లో మాత్రమే సాధ్యం"

"పిచ్చి విజీ అందుకేననుకుంటూ కృష్ణ ఎప్పుడూ అనేవాడు... నా విజీ పిచ్చిది, తండ్రి అంతస్తు, హోదా తప్ప మరో ప్రపంచమే ఉన్నట్టు తెలీదు" అని.

"నువ్వెన్ని చెప్పినా నేను నమ్మను. మీ సంబంధాన్ని పవిత్రమైనదిగా చిత్రించాలని చూడకు" సుమతి కళ్ళు చెమర్చాయి.

"నమ్మవు కదూ! నేనూ.. నా కృష్ణ.. అటు చూడు, వానలో తడుస్తూ వెండి పువ్వుల్ని వెద



జల్లుతున్న ఆ పున్నాగచెట్టు కింద ఆడుకునే వాళ్ళం. అయిదేళ్ళ వయసులో బొమ్మల పెళ్ళిళ్ళు చేసేవాళ్ళం. నా కృష్ణకు ఆ పున్నాగ పూలతో సన్నాయి వాయించడం ఎంతిష్టమో! ఆ పువ్వులంత తెల్లనిది మా స్నేహం. వాటి పరిమళమంత స్వచ్ఛమైంది మా అనుబంధం. విధివశాత్తూ చిన్నతనంలోనే మేం ఒకరికొకరం దూరమయ్యాం."

"మరయితే నీ గురించి ప్రతి పేజీ ఇలా ఎందుకు నింపుతాడు? ఇంకా అతనికి నాపై ఏం ప్రేమ మిగిలిందని? నువ్వసలు ఇక్కడెందుకున్నట్టు?" నిలదీసింది విజేత.

అప్పుడు సుమతి చెప్పింది, చాలా శాంతంగా...

"నువ్వు అతన్ని నిజంగా ప్రేమిస్తే, ఆ రోజు, అదే మీ నాన్నతో ఘర్షణపడ్డ రోజు.. అతన్ని ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోతావా? పైగా అతనిది ఓవర్ కాన్ఫిడెన్స్ అని నిందిస్తావా? నీకతను యూనివర్సిటీ నుంచి మాత్రమే పరిచయం. నాకు అతను అ,ఆ లు దిద్దినప్పటి నుంచీ తెలుసు. అతనొక జీనియస్ అని. జీవితంలో తప్పకుండా ఓ ఉన్నతస్థానాన్ని చేరుకుంటాడని. అసలు నువ్వుగానీ మీ నాన్నగానీ అతని వ్యక్తిత్వానికీ, సంస్కారానికీ విలువెప్పుడిచ్చారు గనక!"

విజేత సమాధానం చెప్పలేక తలదించుకుంది. కొంతసేపటికి తేరుకుని సుమతే అంది "నువ్వేమీ దిగులుపడనవసరం లేదు. కృష్ణ ఎప్పటికీ నీవాడే. మీ పెళ్ళికి నేను పున్నాగ పూలతో సన్నాయి వాయిస్తాను. నిన్ను పెళ్ళికూతురిగా ముస్తాబు చేస్తాను. నా కృష్ణుడికి ఇంద్రధనుస్సు రంగులతో వెడ్డింగ్ సూట్లు కుట్టిస్తాను..."

అంతలో జీపు వచ్చి ఆగిన చప్పుడైంది.

"అదిగో కృష్ణ వచ్చేశాడు. నువ్వు మనసులో మరే అనుమానం పెట్టుకోకు. దయచేసి మీ వివాహానికి నీ సమ్మతిని తెలుపు. ఇక ఆలోచించకు. ఆల్ ది బెస్ట్" నెమ్మదిగా డైనింగ్ రూములోకి వెళ్ళింది సుమతి.

లోనకొస్తూనే సంతోషంగా పలకరించాడు కృష్ణ "బాగున్నావా విజీ! ఇక్కణ్ణించి మా వాళ్ళు ఫోన్ చేశారు. అందుకే క్యాంప్ మధ్యలోనే మానుకుని నిన్ను చూద్దామని వచ్చేశాను"

'ఎప్పటిలానే ప్రేమగా మాట్లాడుతున్నాడు. ఎంత నాటకం?' అనుకుంది విజేత.

మళ్ళీ అతనే నవ్వుతూ చెప్పాడు. "మీ నాన్నగారు బావున్నారా? నేను అనుకున్నది సాధించాను. మరి ఇప్పటికైనా మన పెళ్ళికి ఒప్పుకుంటారా?"

"స్టాప్ దిస్ నాన్సెన్స్! ఇంకా ఎందుకు నన్ను మోసం చెయ్యాలని చూస్తావు? సుమతితో నీ ప్రేమ వ్యవహారం నాకు తెలీదనుకున్నావా?" కోపంగా అడిగింది. అతని ముఖం వివర్ణమయింది.

"ఏమిటి నీకు తెలిసింది?" తగ్గు స్వరంతో అడిగాడు.

"నీ డైరీ చదివాను. సుమతితో మాట్లాడాక పూర్తిగా అర్థం చేసుకున్నాను" దృఢంగా పలికింది విజేత గొంతు.

"ఏమన్నావు విజీ.. సుమతీ.. సుమతి.. నీతో మాట్లాడిందా ఎప్పుడు?" అతను పిచ్చివాడిలా అడిగాడు.

"ఇప్పుడే ఇక్కడే నువ్వు రాక ముందు కొద్దిక్షణాల క్రితమే.."

అతని కన్నుల్లో గిర్రున నీరు తిరిగింది.

"సుమతి.. ఇంకెక్కడి సుమతి? మంచి గంధపు చెక్కలను విదేశాలకు స్మగుల్ చేస్తున్న ముఠాను చాకచక్యంతో పట్టుకున్నందుకు నాకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్ లభించింది. ఆ ఫంక్షన్ నుండి తిరిగి వస్తుండగా మాపై కక్ష గట్టిన ఆ ముఠాలోనివాళ్ళు మమ్మల్ని అటాక్ చేసి నన్ను షూట్ చెయ్యబోతుండగా నా సుమతి అడ్డుపడి ఆ కిరాతకుల బుల్లెట్ల వర్షానికి తను బలైపోయింది.


అతని కంఠం గద్గదమయ్యింది. విజేత అవాక్కయి అతన్ని చూసింది.

"అవును విజీ! సుమతి నా కోసం తన ప్రాణాల్ని త్యాగం చెయ్యడం మాత్రమే కాదు. నేను సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేటప్పుడు నాకు కొండంత అండగా నిలిచింది. నన్ను ఆర్థికంగా ఆదుకుంది. రాత్రనకా, పగలనకా నాతోపాటు తనూ మేలుకుని నన్ను చదివించింది. నన్నీ స్థాయికి తెచ్చిన నా నేస్తం ఇంకా ఎక్కడుంది విజీ? ఆమె నా ప్రియురాలనుకున్నావు కదూ? ఛ.. తప్పు విజీ నాలోని ఆశకు ప్రాణం పోసి నా ఆశయానికో రూపం ఇచ్చిన చల్లని తల్లి... సుమతి నా దైవం..." చేతుల్లో ముఖాన్ని దాచుకుని పసిపిల్లాడిలా రోదించసాగేడు కృష్ణ.

అంతసేపూ మ్రాన్పడిపోయి వింటున్న విజేత ఒక్క ఉదుటున అతన్ని చేరుకుని అతని తలను తన గుండెకు పొదుముకుంది. ఆమె తన కళ్ళనుండి ధారాపాతంగా వర్షిస్తున్న కన్నీటిని ఆపే ప్రయత్నమేదీ చెయ్యలేదు. "కృష్ణా.. నా కృష్ణా" అంటూ అతన్ని ఓదార్చడానికి ప్రయత్నిస్తూ అలా చాలాసేపు వుండిపోయింది. అతని దుఃఖానికి ఉపశమనం ఎప్పుడో!

దూరాన పున్నాగపూలు వర్షపు బొట్లతో ఒకటొకటిగా రాలిపడుతున్నాయి. అవి విజేతకు సన్నాయి వాయిద్యాన్ని వినిపిస్తున్నాయి. ✻

## నానో టెక్నాలజీ



ఇది భవిష్యత్తుకి చెందిన టెక్నాలజీ. ప్రపంచమంతా దీని విశిష్టతను గుర్తించారు. మనదేశంలో కూడా యీ టెక్నాలజీ మీద పరిశోధనలు సాగుతున్నాయి. వెల్‌బియో నానో టెక్ అనే అమెరికన్ కంపెనీ బెంగుళూరులో ఎందరో శాస్త్రవేత్తల సహాయంతో నానో ఛిప్ డిజైన్ పని జోరుగా నడుపుతోంది. వారి ప్రయోగాలు ఫలిస్తే యీ ఛిప్‌ని మన గుండెలోకి పంపి అక్కడున్న కొవ్వుపదార్థాలను కరిగించి హార్ట్ బ్లాకేజెస్ రాకుండా కాపాడుకోవచ్చు. 'నానో టెక్స్' అనే అమెరికా కంపెనీ త్వరలో తమ రిసెర్చి సెంటర్‌ని బెంగుళూరులో స్థాపించనున్నారు. మనదేశం కూడా నానో టెక్నాలజీకి తగిన ప్రోత్సాహాన్నిస్తోంది. డిఫెన్స్ రిసెర్చ్ లాబ్స్, ఐ.ఐ.ఎస్., బెంగుళూరు కూడా యీ రిసెర్చ్‌లో నిమగ్నమై వున్నాయి.

నానో టెక్నాలజీ ఉపయోగాలు ఊహాతీతమయినవి. పెద్ద టెక్స్‌టైల్ మిల్స్ మరక పడని సూటింగ్ దుస్తుల తయారీలో దీనిని ఉపయోగిస్తున్నారు. పెద్ద ఎలక్ట్రికల్ కంపెనీలు దీని సహాయంతో బాక్టీరియా లేని ఏ.సి.లు, రిఫ్రిజిరేటర్‌లు, ఎం.పి.3 ప్లేయర్‌లు తయారు చేస్తున్నారు. ఇంకొక పూనే కంపెనీ యీ టెక్నాలజీతో 20 కి పైగా ఉపయోగాలు కనిపెట్టారు. దీనితో స్టీల్‌కన్నా గట్టిగా వుండే లోహం తయారుచేయవచ్చని కూడా కనిపెట్టారు. నిజం చెప్పాలంటే నానో టెక్నాలజీ ఉపయోగాలు అంతులేనివనిపిస్తోంది. మీరేమంటారు?

– వి.కె. మోహన్